తలవంచుకొని యేదో డ్రాఫ్ట్ తయారుచేస్తున్న ఎకౌంటెంట్ ఆనందరావ్ యెదురుగా నిలబడ్డ పోస్టుమాన్‌ను గమనించలేదు.

“నమస్కారం ఆనందరావ్‌గారూ!” అన్నాడు వినయంగా. తలెత్తి చూశాడు. మనియార్డరు ఫారం అందించాడు పోస్టుమాన్.

సంతకాలుచేసి ఫారాన్ని తిరిగి అందించాడు.

ఫైలును ప్రక్కకు నెట్టి ఆలోచనలో పడ్డాడు ఆనందరావ్.

రాదనుకున్న చేబదులు. ఫ్రెండ్‌కిచ్చిన పాతికా- అర్ధాంగిని అడిగి అప్పు తీసుకున్న పాతికా తిరిగి వచ్చింది- ఆ మనియార్డరు అమ్మ కడుపు చల్లగా. పాపం ఈ డబ్బు న్యాయంగా అనురాధది. డబ్బు చేతికిస్తే యింటిక్రిందనే ఖర్చు చేసేస్తుంది. గాస్ స్టవ్వో, యిడ్లీ పాత్రో కొనేస్తుంది. బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు. లంచవరు అవగానే బంట్రోతు పోలయ్యను పిలిచి యింటికి కబురు పంపించాడు.

పోలయ్యను చూసిన అనూరాధ మామూలు ధోరణిలోనే పలకరించింది.

“ఏం పోలయ్యా! అయ్యగారు రావడం ఆలస్యం అవుతుందీ. ఆయన కోసం చూడకుండా భోజనం చేసి పడుకోమని చెప్పడానికే కదూ వచ్చావ్!” అని.

కాదన్నట్లు అడ్డంగా తలూపాడు పోలయ్య- ఓ చిరునవ్వు నవ్వాడు.

“అది కాదమ్మగోరూ! ఆనందబాబుగోరు యియ్యేళ అయిదింటికే వచ్చేత్తానని చెప్పమన్నారు!” అన్నాడు

“ఏం? ఆఫీసరుగారూర్లో లేరా?” ఆశ్చర్యంగా అడిగింది.

“ఆనందబాబుగారిసయంలో అలాగంటే నేనొప్పుకోనమ్మగోరూ! మరోళ్ళ సంగతి అనండి పరవాలేదు! ఆనందుబాబు నికార్సయిన మడిసి!”

అతని కాంప్లిమెంట్సుకి అమితానందం పొందింది ఆమె.

“మరి?” అడిగింది అసలు విషయం చెప్పమన్నట్లుగా.

“ఇయ్యేల తొలాట సినిమా కెళ్ళడానిక్రెడీగా వుండమన్నారమ్మగోరూ!”

సర్‌ప్రయిజ్ పొందింది అనూరాధ.

“సినిమాకా?” అడిగింది నమ్మలేనట్లుగా.

“అవునమ్మగోరూ! అయిదింటికల్లా వచ్చేతానని సెప్పమన్నారు:”

అంతలో అయిదేళ్ళ బాబి యింట్లోంచి వీధిలోకి పరుగెత్తి వచ్చాడు

“ఏవిటమ్మా? సినీమా అంటున్నావ్?” అడిగాడు ఆశగా చూస్తూ.

“అవునురా బాబీ! నాన్నగారు సినీమాకి తీసుకెళ్తారుట! వెళ్దామా?” అడిగింది ఆనందంతో తబ్బిబ్బవుతూ.

“నాన్నగారితోనా! భలే! భలే!!” చంకలు గుద్దుకొన్నాడు బాబి.

ఆ తల్లీ కొడుకుల ఆనందం చూసి పొంగిపోయాడు పోలయ్య

“వస్తానమ్మగోరూ!” అంటూ సెలవు తీసుకొన్నాడు

పోలయ్య ఎప్పుడు వెళ్ళిందీ అనూరాధ గమనించనేలేదు కొడుకు సంబరపడ్తూంటే చూస్తూ తానూ పరవశం పొందిందితానుభర్తతోసినిమాకి వెళ్ళిచాలా కాలం అయింది. పెళ్ళయిన కొత్తలో అంటే బాబిగాడు పుట్టకముందు తనూ, భర్తా కలిసి తరుచుగా సినీమాలకి వెళ్ళేవారు. ఆ తర్వాత భర్తకు ప్రమోషన్ వచ్చింది, ఆఫీసులో పనెక్కువైంది. రానురాను శ్రీవారితో సినీమాలు తగ్గిపోయాయ్. భర్త స్నేహితులతో సినీమాకు వెళ్తే తను పక్కింటి పిన్నిగారితోనో, ఎదురింటి భారతమ్మతోనో వెళ్తుంది. చాలా కాలానికి భర్తతో సినీమాకు వెళ్తున్నందుకు మురిసిపోయింది.

“భలే!- భలే! నాన్నగారితో సినీమాకైతే నాకెంతో సరదా! నాన్నగారు బిస్కట్లూ, చాకెట్లూ అవీ కొంటారు. నీవైతే ఏవీ కొనవ్!”

బాబిగాడు బుంగమూతి పెట్టి తనవైపు కోపంగా చూస్తూంటే, వాణ్ణి అమాంతం ఎత్తుకొని గదిలోకి తీసుకెళ్ళి మంచం మీద కూర్చోపెట్టింది.

“అయితే నాన్నగారితోనే వుంటావా?” అడిగింది ఆనందాన్ని అణచుకొంటూ.

“ఊహూ! బజారుకెళ్ళినప్పుడు నాన్నగారితో, యింట్లో అయితే నీతో!” అన్నాడు తల్లిని కావలించుకొంటూ.

“నాకూ నాన్నగారితోనే బజారు కెళ్ళాలని వుంటుందిరా!” అంది నెమ్మదిగా పక్కవాటా వాళ్ళకి విన్పించకుండా.

సాయంత్రం నాలుగున్నర అయ్యే సరికల్లా వంట ముగించింది అనూరాధ. బాబికి పుట్టినరోజుకి కుట్టించిన డ్రెస్ తొడిగింది. దీపావళికి భర్తకొన్న వులి వులీ చీర కట్టుకొంది. అయిదు అయ్యేసరికి వీధిగుమ్మంలో నిలబడి భర్త రాకకై నిరీక్షించసాగింది. వీధి చివరలో మలుపు తిరుగుతూ సైకిలు మొదటి చక్రం కన్పించగానే భర్తే ఎస్తున్నాడనుకొనేది. తల్లినానుకొని ఆమె వెనుకనే బాబి. ఆరుగంటలయినా భర్త రాకపోవడంతో విసుగు పుట్టుకొచ్చిందామెకి. ఇంటోకి, వీధిగుమ్మంలోకి కాలుకాలిన పిల్లిలా తిరగనారంభించింది. ఆమె వెనుకనే బాబి.

“నాన్నగారింకా రాలేదిమ్మా!” అని నిమిషనిమిషానికి కొడుకు అంటూంటే ఆమెకు చిరాకూ, ఆ తర్వాత వుడుకుమోత్తనం పుట్టుకొని రాసాగాయ్

“ఏమోరా! నాకేం తెల్సు?” గట్టిగా కసిరింది.

తల్లి వైఖరికి భయపడి వీధి గుమ్మంలో ఆఖరి మెట్టుమీద కూర్చొని తండ్రి రాకకై ఎదురుచూడ్డం మొదలెట్టాడు. ఆరూ పది నిమిషా లయింది. ఆశ వదలక గుమ్మంలో నిలబడి మరో పది నిమిషాలు చూసింది. వీధి దీపాలు వెలిగాయ్. విసుగూ, కోపం ఆ తర్వాత ఏడుపూ పుట్టుకొచ్చాయ్ ఆమెకు. ఎదురుగా పిల్లలు రైలుబండి ఆట ఆడు

# శ్రావణ మేఘాలు

బెహరా వెంకట సుబ్బారావు



కొంటూంటే అట్టడుగు మెట్టు మీద కూర్చొని చూ ఆనందిస్తున్నాడు బాబి.

"లోపలికి పోతున్నారా బాబీ!" అంది దుంఖాన్ని దిగమింగుకొంటూ. బాబి చటాలున లేచి తల్లితో బాటు లోనికి పోయాడు.

"అసలు సినీమాకు తీసుకెళ్ళమని ఈయన్ను ఎవరు బతిమాలారు?" ఏవేమో తలంచుకొంటూ వూహించుకొంటూ ఏడవటం మొదలుపెట్టింది అనూరాధ.

* * *

సాయంత్రం నాలుగున్నర అయ్యేసరికి ఫైల్సన్నీ సర్దేశాడు ఆనందరావ్. టేబుల్ క్లీన్ చేశాడు. సెక్షను సూపరింటును ఓ గంట పర్మిషన్ అడిగి బయలుదేరాలనుకొన్నాడు. కుర్చీలోంచి లేస్తూండగా ప్యూన్ ఏలయ్య వచ్చాడు.

"అయ్యగారు రమ్మంటున్నారు బాబూ!" అన్నాడు.

"సూపరింటెండెంటుగారేనా? వద నేనూ వద్దామనుకొంటున్నా!" అన్నాడు లేచినిలబడి

"కాదు బాబూ, పెద్దయ్యగారు!" అన్నాడు తగ్గు స్వరంలో.

"ఎందుకు చెపా?" అనుకొంటూ కర్చీఫ్ తుడుచుకొంటూ ఆఫీసరు గదిలోకి అడుగుపెట్టి ఎదురుగా నిలబడ్డాడు వినయంగా. ఆఫీసరు సెక్షన్ సూపరింటెంటుతో చిరాగ్గా మాట్లాడుతున్నాడు భయపడ్డాడు ఆనందరావు ఆఫీసరు తనవైపు తిరగానే నమ్రతగా నమస్కరించాడు. ఆయన నమస్కారం అందుకోలేదు. చాలా కోపంగా వున్నారు.

"చూడండి మిస్టర్ ఆనందరావ్! బడ్జెట్ ఎస్టిమేట్సు పంపలేదని డైరెక్టొరేట్ నుంచి జైనే టెలిగ్రాం వచ్చింది! వై సో డిలే? ఎంత ఆలస్యం అయినా సరే ఈ రోజే డిస్పాచ్ కావాలి!" అంటూ టెలిగ్రాం అతని చేతిలో పడేశాడు ఆఫీసరు. ఆనందరావ్‌కి నెత్తి మీద పిడుగు పడ్డట్టయింది. "సబార్డినేట ఆఫీసెస్ నుంచి ఈరోజే వచ్చాయ్‌సార్!" అని చెప్పాలనుకొన్నాడు. కానీ చెప్పలేక పోయాడు మాటమాట్లాడలేక తిరిగివచ్చి తన సీటులో కూలబడ్డాడు. డ్రాయరు లోంచి ఫైల్సు తీసి బయటపెట్టాడు. ఉసూరుమంటూ ఆనందరావ్ యిల్లు చేరేసరికి రాత్రి తొమ్మిది గంటలయింది.

వీధి తలుపు వారగా వేసుండటంవల్ల నెట్టగానే తలుపు తెరుచుకొంది. గదిలో నీలి రంగు జీరో బల్బు వెలుగుతోంది. అనూరాధ ఈజీ చేర్ లోనూ, బాబిగాడు మంచం మీదా నిద్రపోతున్నారు. ఇద్దరూ సినీమా ముస్తాబులోనే వున్నారు.

'ఛీ వెధవ బతుకు! వెధవ వుద్యోగం!' విసుక్కొన్నాడు మనసులో. లైటువేశాడు. అనూరాధ చెక్కిళ్ళమీద కన్నీటి చారలు స్పష్టంగా కన్పించాయ్. చాలా బాధపడ్డాడు.

అంతలో చటాలున లేచి కూర్చున్నాడు బాబి. తండ్రిని చూడగానే పోయిన వుత్సాహం పుంజుకొచ్చింది. గబగబా మంచం దిగి తల్లిని సమీపించాడు.

"నాన్నగారొచ్చారమ్మా!" తల్లిని తట్టి లేపాడు.

బట్టలు మార్చుకొంటూన్న ఆనందరావ్ వెనక్కు తిరిగి భార్యను చూశాడు, ఆమె చివాల్న లేచి విసురుగా వంట గదిలోకి పోయింది.

లుంగీ కట్టుకొని కుర్చీలో కూర్చొని దగ్గరగా రమ్మన్నట్టు సైగ చేశాడు కొడుక్కి. తండ్రిమీద వాడూ అలిగాడు కాబట్టి దూరంగాపోయి మంచానికి ఆనుకొని నిలబడ్డాడు నిరసనగా.

లేచి ఫాంటు జేబులోంచి బిస్కట్ పాకెట్ తీసి తిరిగి కుర్చీలో కూర్చున్నాడు. తండ్రిని సమీపించి వొడిలో దూరాడు. కొడుకు బిస్కట్ పాకెట్ విప్పుతూంటే నెమ్మదిగా అడిగాడు భార్యకు వినిపించకుండా.

"మీరు భోజనం చేశారా?" అని సమాధానం నెమ్మదిగా చెప్పు అనే అభ్యర్థన వుంది అతని చూపుల్లో.

"లేదు!" అన్నట్టు అడ్డంగా తల ఆడించాడు బిస్కట్టు తింటూ. ఆలోచనలో పడ్డాడు ఆనందరావ్.

"భోజనం వడించా! రమ్మని చెప్పరా బాబీ!" ముక్తసరిగా మూడో వ్యక్తిద్వారా తెలియజేసింది అనూరాధ.

తండ్రీ, కొడుకులిద్దరూ పోయి కంచాల దగ్గర కూర్చున్నారు. అనూరాధ తనకు వడ్డించుకోలేదు. మౌనంగా భోజనం చేస్తూ వుండబట్టలేక కొడుకుని అడిగాడు.

"ఏరా బాబీ! సినిమాకే అంత కోపమా? ఇప్పుడు పోదామా రెండో ఆటకి?"

ఆమె పెదవి కదపలేదు.

"ఓ! అలాగే వెళ్దాం!" అన్నాడు బాబి.

మరేమీ మాట్లాడకుండా భోజనం ముగించాడు ఆనందరావ్. వంటింటిని సర్ది గదిలో ప్రవేశించింది అనూరాధ. భర్త మంచంమీద పడుకొని న్యూస్ పేపర్ చూస్తుంటే దగ్గరగా వెళ్ళి నిలబడి అంది గోడతో అన్నట్లుగా, గోడకున్న ఫొటో వైపు చూస్తూ.

"రేపు విశాఖపట్నం వెళ్తున్నాను!"

ఆనందరావుకి ఆమె మాటలు స్పష్టంగా విన్పించినా ఏమీ మాట్లాడలేదు. విన్పించనట్టుగా వూరుకొన్నాడు.

"రేపు నాన్నగారి దగ్గరికి వెళ్తున్నా!" అంది మరలా.

"ఏం? రమ్మని వుత్తరం వచ్చిందా?" అడిగాడు పేపరులోంచే.

"మా యింటికి వెళ్ళడానికి పిలుపు రావాలా?"

ఆమె అవివేకానికి జాలిపడ్డాడు. ఆలోచిస్తూ వుండిపోయాడు.

"ఉదయం ఎక్స్‌ప్రెస్‌కి వెళ్తున్నా!" అంది దృఢంగా

"సరే నీ యిష్టం!" అనేసి పేపరు క్రింద పడేశాడు. ఆ తర్వాత గోడ వైపు తిరిగి పడుకున్నాడు.

లైటార్పేసి తన మంచం మీద పడుకొంది ఆమె.

తెల్లవారు ఝామున నాలుగ్గంటలకల్లా లేచింది. కుంపటి మీద భర్తకు ఆ పూటకు వండిపెట్టింది. పెట్టె సర్దుకొంది. బాబిని లేపి స్నానం చేయించింది. బట్టలు తొడిగింది. తానూ కట్టుకొంది. ఆనందరావుకి తెలివి వచ్చినా పక్కమీద నుంచి లేవలేదు. తెలతెలవారింది.

"బాబీ! కాఫీ రెడీ అయిందని నాన్నగారితో చెప్పు." అంది.

చివాల్న లేచి పెరట్లోకి వెళ్ళాడు ఆనందరావు. తిరిగి వచ్చేసరికి తల్లీ పిల్లలిద్దరూ పూర్తిగా టాయ్‌లెట్ అయి రెడీగా వున్నారు.

టేబిలుమీద కాఫీ పెట్టింది "తీసుకొండి నాన్నగారూ!" చెప్పాడు బాబి.

కాఫీ తాగుతూ ఆలోచిస్తూ వుండిపోయాడు ఆమెను వెళ్ళొద్దని చెప్పడానికి అహం అడ్డొచ్చింది. అలా అంటే ప్రతి మాలినట్లుగా వుంటుందని భావించాడు. అయినా సినిమాకి తీసుకెళ్ళనంతమాత్రాన యింత పట్టుదలా?" అనుకొన్నాడు

ప్రయాణం అవుతున్నా వెళ్ళొద్దనిగానీ, ఇప్పుడెందుకనిగానీ, ఏదో పనివుండి ఆఫీసులో వుండిపోయాను కుదరలేదు అని గానీ భర్త అనకుండా నిరక్ష్యంగా "నీ ఇష్టం!" అనేస్తారా! కళ్ళనీళ్ళ పర్యంతం అయింది అనూరాధకు.



"ఎక్స్‌ప్రెస్‌కి వెళ్తున్నాం అని చెప్పరా!" అంది బెక్కుతూ కొడుకుతో.

తల ప్రక్కకు తిప్పి భార్యను చూశాడు ఆమె చూపుల్ని ప్రక్కకు మరల్చుకొంది. పుట్టిన రోజుకి తాను కొన్న చీరలో ఆమె అందం ద్విగుణీకృతమైంది. అయినా వారించలేకపోయాడు. అనునయించలేక పోయాడు.


## అరబ్ దేశాలలో ఉద్యోగం

ఖచ్చితమైన పద్ధతి, ప్రభుత్వ నిబంధనలు మరియు ఖాళీలు తెలుసుకునే విధానం మీకు తెలిసినట్లయితే గల్ఫ్ దేశాలలో నేరుగా ఉద్యోగంను మీరు పొందవచ్చు. స్త్రీలు / పురుషులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ మరియు అన్ స్కిల్డ్ పనివార్లగా నెలకు మూడు నుంచి పన్నెండు వేల రూపాయల వరకు జీతంపై ఉద్యోగావకాశాలు రోజురోజుకు పెరుగుతున్నాయి ఇటీవల చాలామంది నేరుగా ఉద్యోగాలు పొందారు. పూర్తి సమాచారం మరియు 800 విదేశీసంస్థల యొక్క చిరునామాలు మరియు 100 మంది రిక్రూటింగ్ ఏజెంట్ల చిరునామాలు గల గైడు కొరకు ఇంగ్లీషు/హిందీలో మాత్రమే స్వంత చిరునామాగల కవరుతో మాకు వ్రాయండి.

GLOBE SERVICE INFORMATION CENTRE (REGD) (411/1)
24, Mahabir Nagar, NEW DELHI-110018.



## ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతుల మీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.
వ్రాయండి లేదా సంప్రతించండి. ఫోన్: 395126

SUPREME CORPORATION (BANKERS)
F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory,
Tredeo Road, BOMBAY-400 034.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో







"అయితే నీవూ వెళ్తున్నావన్నమాట" అన్నాడు తనవైపే చూస్తున్న కొడుకుతో.

"అక్కడ రామంబావ బీచ్‌కి తీసుకెళ్ళి సముద్రంలో షిప్పులు చూపిస్తాడు. బతాణీలూ, చాక్లెట్లూ కొంటాడు!...." ఏదో చెప్పాడు వాడి ధోరణిలో.

"అంతేనా సినిమాలూ అవీ చూపించడూ?" అడిగాడు భార్యవైపు చూస్తూ.

రోషంగా భర్తను చూసింది అనూరాధ. ఆమె కళ్ళల్లో నీరు స్పష్టంగా కన్పించింది ఆనందరావ్‌కి.

"అమ్మా బండికి టైమయిపోతోంది!" వీధిలోంచి రిక్షావాడు కేకేశాడు.

వీధిలోకి నడిచింది అనూరాధ. ఆమె వెనుకనే బాబి. ఆనందరావూ వాళ్ళ వెనుకనే వెళ్ళాడు. వీధిలో రిక్షా ఆగి వుంది. బాబిగాడు గబగబాపోయి రిక్షా ఎక్కేశాడు. అనూరాధ అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్ళి రిక్షా ఎక్కింది.

భార్య చూస్తూండగా అయిదు పది రూపాయల నోట్లు బయటకు తీసి లెక్కపెట్టి బాబి జేబులో పెట్టాడు.

"జాగ్రత్తగా వెళ్ళండి!" అన్నాడు కొడుకుతో.

తనతో భర్త స్టేషను వరకూ వస్తారని ఆశించిన అనూరాధ మరోసారి ఖంగు తింది.

"బాబూ! తవరు రారా?" అడిగాడు రిక్షావాడు.

"ఆయన రారుగానీ త్వరగా పోనియ్!"

బాబి తండ్రికి టాటా చెప్పాడు హుషారుగా తానూ తిరిగి చేయి వూపుతూ చెప్పాడు.

* * *

మూడూ, నాలుగూ, పది రోజులు భారంగా గడిపాడు ఆనందరావ్. అనూరాధ లేని యిల్లు ఎడారిలాగా తోచింది అతనికి. ఈ పరిస్థితికి తానెంతవరకూ బాధ్యుడో తెలుసుకొన్నాడు. ఓ నిర్ణయానికి వచ్చాడు.

మర్నాడు ఆఫీసుకు సెలవుపెట్టి విశాఖపట్నం బయలుదేరాడు. రైలు టిక్కెట్లు తీసుకొన్నాక తెలిసింది తాను వెళ్ళాల్సిన ట్రైను రెండు గంటలు లేటని ప్లాట్‌ఫారం మీదికి వెళ్ళి అటూ, యిటూ పచార్లు చేయడం మొదలుపెట్టాడు. అంతలో హౌరానుంచి ఎక్స్‌ప్రెస్‌వచ్చి ఆగింది. ప్రయాణీకుల్లో సందడి ఎక్కువయింది. కాలక్షేపంకోసం బండినీ, ప్రయాణీకుల్ని చూస్తూ అటూయిటూ తిరగనారంభించాడు.

"అమ్మా! నాన్నగారొచ్చారు!" అన్న బాబిగాడి మాటలు విన్పించాయ్. ప్రాణం లేచి వచ్చింది ఆనందరావ్‌కి. వెనక్కు

తిరిగి చూశాడు. పెట్టె క్రిందపెట్టి నేల చూపులు చూస్తూ నిలబడివుంది అనూరాధ. తండ్రికి ఎదురుగా వెళ్ళి వాటేసుకొన్నాడు బాబి. కూలీని పిలిపించి పెట్టెను పట్టించుకొని బయటకు నడిచాడు. మౌనంగా భర్తను అనుసరించింది ఆమె.

కొడుకును రిక్షాలో కూర్చోబెట్టి భార్య వైపు చూశాడు ఎక్కమన్నట్టుగా. ఆమె రిక్షాలో కూర్చోగానే తనూ ఎక్కి కూర్చున్నాడు. రిక్షా బయలుదేరింది.

తల్లిదండ్రులు మౌనంగా వుండటం ఏమీ నచ్చలేదు కాబోలు బాబికి. తనే మాటల్లోకి దించాడు.

"మేము వస్తామని తెల్సా నాన్నగారూ? స్టేషన్కు వచ్చారు?" అడిగాడు తండ్రిని.

భర్త సమాధానంకోసం చూసింది అనూరాధ. అది కనిపెట్టిన ఆనందరావ్ తకీమని సమాధానం చెప్పాడు.

"లేదురా! మా ఫ్రండ్ వస్తాడని స్టేషన్కు వచ్చా!"

"మరి అతను రాలేదా? మాతో వచ్చేస్తున్నారు!"

ఇరకాటంలోపడ్డాడు ఆనందరావు, భార్య వైపు చూశాడు. ఆమె తన దృష్టిని రోడ్డు మీదికి మరల్చుకొంది. అతను కుమారుని ప్రశ్నకు జబాబు చెప్పలేదు. తిరిగి ప్రశ్నించాడు.

"విశాఖపట్నంలో ఏ ఏ సినీమాలు చూశార్రా?"

భర్త ప్రశ్న ఆమెను రెచ్చగొట్టింది. "హుఁ! మనిషిలో మార్పులేదు!" అనుకొంది.

"ఒరే బాబీ! నోరు మూసుకొని కూర్చో!" అంది భర్తను మందలించలేక.

ప్రస్తుతానికి అదే మంచిది! అనుకొన్నాడు ఆనందరావ్.

రిక్షా దిగ్గానే హోటలుకెళ్ళి రెండు క్యారేజీలు తెచ్చి వంటగదిలో పెట్టాడు. అతని వెనుకనే వంటగదిలోకి వెళ్ళింది అనూరాధ. తిరిగి గదిలోకి వచ్చి బట్టలు మార్చుకొన్నాడు. లుంగీ కట్టుకొని ఈజీ చేర్లో కూర్చున్నాడు ఆనందరావ్. బాబి తాను విశాఖపట్నంనుంచి తెచ్చుకొన్న బొమ్మలు ఒక్కొక్కటే సంచీలోంచి బయటకుతీసి గచ్చుమీద వరసగా పేర్చుతున్నాడు. వంటగదిలో గిన్నెలు చప్పుడు తప్పించి నిశ్శబ్దంగా వుంది.

"తను వెళ్ళాల్సిన ట్రైను లేటవడం చాలా మంచిదయింది!" అనుకొన్నాడు అతను పైన తిరుగుతూన్న సీలింగ్ ఫాన్ వైపు చూస్తూ.

"భోజనం వడ్డించానురా బాబీ!" అని పిలుపు వచ్చింది. పిలవడమే తడవుగా తండ్రీ.కొడుకులిద్దరూ పోయి పీటలమీద కూర్చున్నారు. అనూరాధ వడ్డించుకోలేదు. "తినక యేంచేస్తుందిలే." అనుకొన్నాడు నిర్లక్ష్యంగా.

తలవంచుకొని అన్నం కలుపుకొంటున్న భర్తను కోపంగా చూసింది. నేతి గిన్నె తేవడానికి లేచి గదిలోకి వెళ్ళింది. గదిలో బట్టల స్టాండు క్రింద గోడవారగా ఒక రైలు టికెట్ పడివుండటం గమనించింది. తీసిచూసింది పరీక్షగా, ఆరోజుదే! రాజమండ్రీ టూ వాల్తేరు! ఆశ్చర్యపోయింది. అంటే ఆయన ఈరోజు విశాఖపట్నం రాబోయారన్నమాట! తానొక్కపూట ఆగితే ఎంత బాగుణ్ను! పదిరోజులూ గంటొక యుగంలా గడిచాయ్! భర్తనుంచి వుత్తరంకూడా రాకపోవడంతో ఆందోళన పడింది. తల్లిదండ్రులు మరో వారంరోజు లుండమని యెంత బ్రతిమాలినా ఒక్కపూటకూడా యిక వుండలేకపోయింది."

ఏదో ఆలోచన తట్టి ఆమె మొహం విప్పారింది. నేతి గిన్నెతో వంట గదిలోకి వెళ్ళింది. తండ్రి యేదో అడిగాడు కాబోలు కొడుకు సమాధానం చెబుతున్నాడు బాబి.

"విశాఖపట్నంలో అస్తమానూ మబ్బులే నాన్నగారూ! దబదబా వాన పడేది. మళ్ళా ఆగిపోయేది. ఒక్కసారే రాముంబావ బీచ్కి తీసుకెళ్ళాడు. షిప్లు చూపించాడు. అయిస్ ఫ్రూట్ కొన్నాడు. అవి మన వూళ్ళోకన్నా అక్కడ చాలా తియ్యగా వుంటాయి నాన్నగారూ!"

భర్తకు నెయ్యి వడ్డించి ఎదురుగా కూర్చొంది అనూరాధ ధైర్యంగా.

"అది సరేకానీ బాబీ! పాపం ఎవరో ప్రయాణీకులు విశాఖపట్నం వెళ్దామని టికెట్ కొనుక్కొని మరీ ప్రయాణం మానుకొన్నారు! డబ్బు దండగయింది!" అంటూ ఆ టికెట్ను భర్తముందు పడేసింది కిలకిలా నవ్వుతూ.

గతుక్కుమన్నాడు ఆనందరావ్. ★

